క్లుప్తంగా

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు



నవరత్న సాగులో మొలిచిన మొక్కలను పరిశీలిస్తున్న ఏపీఎం

మాకవరపాలెం: ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వెలుగు ఏపీఎం చిన బాబు తెలిపారు. ప్రకృతి సాగులో భాగంగా నవధాన్యాల సాగు–నేలతల్లి బాగు కార్యక్రమంలో భాగంగా జంగాలపల్లిలో భూసారానికి ఉపయోగపడే 30 రకాల విత్తనాలు వేశారు. వీటిని గురువారం ప్రకృతి సేద్యం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 రకాల విత్తనాలు వేసిన అనంతరం వచ్చిన మొక్కలను పశువులకు మేతగా వేసుకోవచ్చన్నారు. వేరు భాగాన్ని దమ్ములో కలియ దున్నితే వరి సాగు చేసే భూమికి సారవంతంగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుదర్శన్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం



జోగుంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

గొలుగొండ: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు శ్యామ్‌కుమార్, ధనంజయ్, మధుసూదన్ తెలిపారు. డెంగ్యూ నివారణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా జోగుంపేట వారపు సంతో వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నెల రోజులు పాటు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అవగాహనతోనే డెంగ్యూ నయం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డ్వాక్రా సభ్యులకు మొక్కల పంపిణీ



డ్వాక్రా సభ్యులకు మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గొలుగొండ: గ్రామాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీపీ గజ్జలపు మణి కుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తెలిపారు. గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా గొలుగొండలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు కొబ్బరి, మామిడి, సపోట, బత్తాయి మొక్కలు పంపిణీ చేశారు. మొక్కలు నాటడం వల్ల మన ప్రాంతమంతా పచ్చదనంగా ఉంటుందని, దీనివల్ల పర్యావరణం మెరుగుపడుతుందని తెలిపారు. సర్పంచ్ కసిపల్లి బుజ్జి, ఏపీఎం మంగ, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

169 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు: వైద్య సిబ్బంది సూచనలను పాటించడం ద్వారా మంచి ఆరోగ్యం పొందవచ్చునని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా మేడిచర్లలో వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. 169 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇక్కడ హైస్కూల్‌లో 89 మంది విద్యార్థులను పరీక్షించారు. హెల్త్ సూపర్‌వైజర్ బి.రాము, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా బోధన

నాతవరం: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. స్థానిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. జగనన్న విద్యా కిట్లు పంపిణీపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల బోధన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. వంటలను స్వయంగా పరిశీలించారు. పాఠశాలలో ప్రధాన సమస్యలతోపాటు నాడు – నేడు పథకంలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పనులపై ఉపాధ్యాయులతో చర్చించారు. వర్షాలు కురుస్తున్నందున పాఠశాల ప్రాంగణమంతా శుభ్రంగా ఉంచాలన్నారు. రోగాలు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం నిరంతర కృషి

- గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



పొంగలిపాకలో మహిళలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. పొంగలిపాక, శివారు పి. శివరామపురం గ్రామాల్లో గురువారం ఆయన అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పక్కా గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు పాత బిల్లులు అందించడానికి కృషి చేస్తామన్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి పొంగలిపాక పంచాయతీలో రూ.57 లక్షలతో 400 మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. జగనన్న లేఅవుట్‌లో 69 ఇళ్లకుగాను పది పూర్తి కాగా, 28 నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఎస్.కె. చిన్నబాయ్ ఏడేళ్లుగా కనిపించకుండా పోయాడని అతడి భార్య మీరాబాయ్ వాపోయింది. దీనిపై కేసు నమోదు చేసి పంచనామా, నోటరీ చేయించాలని ఎస్ఐ దామోదర్‌నాయుడును ఆదేశించారు. రూ. 21.80 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో నాడు – నేడులో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. విద్యార్థులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో ముచ్చటించారు. గర్భిణులను ఆశీర్వదించారు. వెలుగు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు మంత్రిని సన్మానించారు. వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నాయిన ధన, సర్పంచ్ నాయిన దేముడమ్మ, ఉప సర్పంచ్ ఉండూరు భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు మైచర్ల సన్యాసిరావు, మాజీ సర్పంచ్ నాయిన సత్యనారాయణ, కింతలి సచివాలయ కన్వీనర్ జామి చిన్న, మాజీ సర్పంచ్ మైచర్ల సత్యంనాయుడు, నాయకులు పి. చిన్నారావు, సుంకర శ్రీను, కోరుకొండ చెల్లంనాయుడు, తాళ్లపురెడ్డి రాంబాబు, బొడ్డాపు భాస్కరరావు, దొండా నాగమణి, ఎం. కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, అధికారులు పాల్గొన్నారు.

నేడు తంగుడుబిల్లిలో 'గడపగడపకు'

చీడికాడ: తురువోలు శివారు తంగుడుబిల్లిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారన్నారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

జగనన్న పాలనలోనే నేరుగా పేదలకు పథకాలు

- 'గడపగడపకు'లో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



సమస్యలేమైనా ఉన్నాయా అని మహిళను అడిగి తెలుసుకుంటున్న ధర్మశ్రీ

రావికమతం: జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాకే పేదలందరికీ పథకాలు నేరుగా అందుతున్నాయని, మళ్లీ ఆయన్నే గెలిపించుకోవాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రావికమతంలో గురువారం ఆయన ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా, ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో సంక్షేమంతోపాటు మరో పక్క అభివృద్ధిని వేగంగా చేస్తున్నట్టు వివరించారు. గ్రామంలో మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు ఇటీవలే తొలగించారని, ప్రధాన డ్రైనేజీ లేక రోడ్డుపైనే మురుగు పారుతోందని గ్రామానికి చెందిన ముక్కా రాముడు, తాతారావు, చినబాబు తదితరులు వాపోయారు. దీనిపై ఆయన స్పందించి ప్రధాన డ్రైనేజీ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఎంపీపీ పైల రాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, భవానీప్రసాద్, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు గర్హనీయం



ఏఎల్‌పురంలో వలంటీర్ల మానవహారం

గొలుగొండ: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. గురువారం ఏఎల్‌పురంలో వలంటీర్లు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఏఎల్‌పురం, పాత కృష్ణదేవిపేట, కొంకసింగి, నాతాపురం వలంటీర్లు ర్యాలీలు నిర్వహించి ఏఎల్‌పురం ప్రధాన రోడ్డులో మానవహారం చేపట్టారు. ప్రజలకు అనేక సేవలందిస్తున్న తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరంగా ఉందన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పైసా రుసుం లేకుండా జగనన్న సురక్ష సేవలు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కొవ్వూరులో అర్జీదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ

రోలుగుంట: రూపాయి రుసుం తీసుకోకుండా అర్జీదారులకు అక్కడికక్కడే ధ్రువపత్రాలు అందజేసే బృహత్తర కార్యక్రమం జగనన్న సురక్ష అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. రోలుగుంటలో తహసీల్దార్ వరహాలు, కొవ్వూరులో ఎంపీడీవో కే ప్రభాకరరావు తమ బృందాలతో గురువారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమాల అమలుతోపాటు విద్యార్థులు, రైతులు, తదితర అవసరాలకు అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా వారి వద్దకే వచ్చి అందివ్వడం హర్షణీయమన్నారు. తన విద్యార్థి దశలో ఆదాయ, కుల, నివాస, పుట్టిన తేదీ, తదితర ధ్రువపత్రాలు కావాలంటే ఆ శాఖల అధికారుల చుట్టూ సంతకాల కోసం, ఆ తర్వాత ధ్రువపత్రాల కోసం సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సినోపరిస్థితి ఇప్పుడు లేదన్నారు. అర్జీ ఇవ్వడమే ఆలస్యం నేరుగా వారి వద్దకే ఉచితంగా ధ్రువపత్రాలు జారీ చేయడం గత చరిత్రలో ఎన్నడూ లేదన్నారు. ఈ అవకాశం వేలాది మందికి వరంగా మారిందన్నారు. దీనిలో భాగంగా కొవ్వూరులో 771 గృహాలకుగాను 577 అర్జీలు రాగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలను ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మతో కలసి ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు లక్ష్మి, రామూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి. రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతల లక్ష్మీశ్రీనివాస్, పాచిలి రామకృష్ణ, యర్రంశెట్టి రాజారావు, చెట్టుపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఐదుగురు విద్యార్థుల ఎంపిక



తరుణ్‌కుమార్



హరిత



స్వర్ణకుమారి



యశ్వంత్



హేమసాగర్



మాకిరెడ్డి దివ్య



మడ్డు ధనలక్ష్మి

రావికమతం: మరుపాక మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. విద్యార్థులు ద్వారపూడి తరుణ్‌కుమార్ (578), తూరుబిల్లి హరిత(575), సాసుబిల్లి స్వర్ణకుమారి(566), దుడ్డి యశ్వంత్(567), కాశెట్టి హేమసాగర్ 565) మార్కులతో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. వీరిలో తరుణ్‌కుమార్, హరిత నూజివీడు ట్రిపుల్ ఐటీకి, స్వర్ణకుమారి, యశ్వంత్, హేమసాగర్ శ్రీకాకుళం ట్రిపుల్ టీకి ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ సత్య సునీల్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రావి గోవిందు అభినందించారు.

కేజీబీవీ నుంచి ఇద్దరు..

రోలుగుంట: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం నుంచి ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తులసి గురువారం తెలిపారు. విద్యార్థిని మాకిరెడ్డి దివ్యకు నూజివీడు, విద్యార్థిని మడ్డు ధనలక్ష్మికి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయన్నారు. గత నెల ఆణిముత్యాలు కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి నుంచి దివ్య రూ.50 వేలు, ధనలక్ష్మి రూ.30 వేలు ప్రోత్సాహకాలు పొందారన్నారు.

తప్పుడు పనులకు ఎమ్మెల్యే వత్తాసు పలకాలా?



మాట్లాడుతున్న వెంకునాయుడు, తదితరులు

మాకవరపాలెం: ఎమ్మెల్యే గణేష్‌పై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మాజీ సర్పంచ్ పోతల వెంకునాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు బొడ్డు నాయుడు, సర్వేశ్వరరావు తెలిపారు. లచ్చన్నపాలెం పంచాయతీ 4వ వార్డు సభ్యురాలు రాళ్లపల్లి పార్వతి బుధవారం ఎంపీడీవో అరుణశ్రీకి రాజీనామా పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ వార్డు సభ్యురాలికి రేషన్ డిపో కేటాయించగా, పాత డీలర్ కోర్టు ఉత్తర్వులతో మళ్లీ కొనసాగుతున్నారన్నారు. ఆమె భర్త ప్రభుత్వ మద్యం దుకాణంలో అక్రమాలకు పాల్పడటం వల్ల సూపర్‌వైజర్ విధుల నుంచి తొలగించారన్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండింటిని కొనసాగించాలని కోరారన్నారు. దీనికి ఎమ్మెల్యే నిరాకరించడంతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్టు స్పష్టం చేశారు.

21 నుంచి పక్కా ఓటరు సర్వే



అధికారులతో సమీక్షిస్తున్న ప్రమీలాగాంధీ

రావికమతం/బుచ్చెయ్యపేట/రోలుగుంట: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ బూత్ స్థాయిలో ఇంటింట ఓటరు సర్వే చేపట్టాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రమీలాగాంధీ తెలిపారు. బుచ్చెయ్యపేట మండల పరిషత్, రావికమతం, రోలుగుంట తహసీల్దారు కార్యాలయాల్లో వేర్వేరుగా ఆమె సమీక్షించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు కార్డు ఆధార్‌తో అనుసంధానం చేశారా? లేదా తెలుసుకోవాలన్నారు. ఓటరు వివరాలు పక్కాగా ఉన్నాయా లేదా పరిశీలించి డేటాను తయారు చేయాలని సూచించారు. సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. ఏవైనా ఫిర్యాదులు వస్తే బీఎల్వోలు బాధ్యత వహించాలన్నారు. తహసీల్దార్లు వెంకటేశ్వరరావు, కె.వరహాలుబాబు, మహేశ్వరరావు, ఆర్ఐకు రామూర్తి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- గడవగడవకు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ 4వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు వార్డు కౌన్సిలర్ దాడి తర్నం, దాడి బుజ్జి, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. వీధుల్లోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ద్వారా చేకూర్చిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, రహదారి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. వారంలో రోజుల్లో పనులు ప్రారంభమవుతాయన్నారు. ఏ వార్డుకు వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఏ పథకం కావాలన్నా వలంటీర్లకు తెలియజేస్తే వారే దరఖాస్తు చేస్తారని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషాబేగం, కర్రి శ్రీనివాసరావు, అర్జున్, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, లగుడు స్వామి, టౌన్ మహిళా విభాగం అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్, ఏఎంసీ డైరెక్టర్ లోకవరపు శారద, నూకాలమ్మ దేవస్థానం చైర్మన్ ధనిమిరెడ్డి నాగు, యూత్ అధ్యక్షుడు ధనిమిరెడ్డి ప్రసాద్, పార్టీ నాయకులు లలిత, అన్నపూర్ణ, యాదగిరి శేషు, నక్కా శ్రీను పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు ప్రభుత్వం శ్రీకారం

- పండ్ల మొక్కలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గణేష్



స్వయం సహాయక సభ్యులకు మొక్కలు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: గ్రీన్ మిలీయనం ప్రోగ్రాంలో భాగంగా స్వయం సహాయక సభ్యులతో లక్ష పండ్ల మొక్కలను నాటే కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వాక్రా సభ్యులకు ఆయన మొక్కల పంపిణీ చేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం 778 గ్రూపులకు 2,328 రకాల పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేసిందన్నారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ బోళెం వెంకటేష్, ఎంపీడీవో జయమాధవి, ఐకేపీ ఏపీఎం పార్వతి, నాయకులు గుడివాడ లోవరాజు, పెట్ల చినఅప్పలనాయుడు, కార్యాలయ ఏవో రమణబాబు, యరకన్నపాలెం వైస్ సర్పంచ్ సుర్ల శేఖర్ పాల్గొన్నారు.

నీటి తీరువా వసూలుతో కాలువల అభివృద్ధి



తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడుతో చర్చిస్తున్న తాండవ ప్రాజెక్టు డీఈ స్వామినాయుడు

నాతవరం: రైతులు నుంచి నీటి తీరువా వసూలు చేయడం ద్వారా సాగునీటి కాలువల అభివృద్ధి చేసుకునేందుకు నిధులు సమస్య ఉండదని తాండవ ప్రాజెక్టు డీఈ స్వామినాయుడు, తహసీల్దార్ ఎస్.ఎ స్.వి.శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ జిల్లాలోనే అధిక విస్తీర్ణంలో తాండవ రిజర్వాయరు ఆయకట్టులో వరి సాగవుతోందన్నారు. ఈ ప్రాంతంలో రైతుల నుంచి రెవెన్యూ అధికారులు చాలా కాలంగా నీటి తీరువా వసూలు చేయడం లేదన్నారు. పర్యవసానంగా రూ.4 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయన్నారు. గతంలో సకాలంలో నీటి తీరువా వసూలు చేయడంతో నిధులు సమస్య ఉండేది కాదన్నారు. మరలా పన్నులు వసూలుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల నుంచి నీటి తీరువా వసూలుకు చర్యలు చేపడతామన్నారు. వెంటనే వీఆర్వోలతో సమావేశమై వసూలు లక్ష్యం విధిస్తామన్నారు. తాండవ ప్రాజెక్టు నాతవరం సెక్షన్ జేఈ శ్యామ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి బోర్ల ఏర్పాటు



బోరు తవ్వకం పనులు ప్రారంభిస్తున్న నాయకులు

చోడవరం: మండలంలోని గంధవరం, ముద్దుర్తి గ్రామాల్లో మంచినీటి బోర్లు ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్ తన జెడ్పీ నిధుల నుంచి రూ. 5 లక్షలు వీటికి కేటాయించారు. ఈ నిధులతో గంధవరం సమీపంలో పూసర్ల వారి కల్లాల వద్ద ఒకటి, ముద్దుర్తి గ్రామానికి చెందిన రైతుల కల్లాల వద్ద రెండు , వెంకన్నపాలెంలో ఒక బోరును ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టారు. ముద్దుర్తి సర్పంచ్ కడిమి వెంకట్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మొల్లి ప్రసాద్, అప్పికొండ లింగబాబు, దొడ్డి హనుమంతు పాల్గొన్నారు.

వందేమాతరం ఇలా పాడాలి..

విద్యార్థులతో బాల గాయకుడు ధీరజ్



విద్యార్థులకు గేయం పాడటాన్ని తెలియజేస్తున్న గాయకుడు ధీరజ్

మాకవరపాలెం: చాలా మంది విద్యార్థులకు వందేమాతర గీతం ఆలపించడం సరిగా రావడం లేదని, అందుకే నేర్పిస్తున్నానని బాల గాయకుడు ధీరజ్ పేర్కొన్నాడు. స్థానిక కేజీబీవీ, జి.వెంకటాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు వందేమాతరం గీతాన్ని లయబద్ధంగా ఆలపించే విధానంపై అవగాహన కల్పించాడు. అనంతరం ఆయా పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. గౌతమి లలిత కళా శిక్షణా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు పాల్గొన్నారు.

దండు ముత్యాలమ్మ ఒడ్డు పండగ

కె.కోటపాడు: గొండుపాలెం గ్రామ దేవత దండు ముత్యాలమ్మ ఒడ్డు పండగను గురువారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ అమ్మవారి ఆలయం వద్ద భక్తులు పసుపుకుంకుమ, చీరలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.

వడ్డాదిలో ఘనంగా మరిడిమాంబ పండగ



అమ్మవారి ఘటాలతో గుడికి వెళ్తున్న భక్తులు

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలో మరిడిమాంబ పండగను గురువారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ శివారులో అమ్మవారి గుడికి గ్రామస్తులంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆ సమయంలో డప్పులు, వాయిద్యాలు, నేలడాన్స్ మధ్య బాణసంచా కాల్పులతో ఉత్సాహంగా గుడికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈ ఏడాది వర్షాలు సమృగా కురవాలని, పాడిపంటలు బాగా పండాలని, కుటుంబ సభ్యులు, పాడి పశువుల ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు చేశారు.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో కరెంటు కష్టాలు

- సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజలు తీవ్రమైన కరెంటు కష్టాలు ఎదుర్కొంటున్నారని పలువురు ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులను నిలదీశారు. ఎంపీపీ జయమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ జేఈ మాట్లాడుతుండగా వైస్ ఎంపీపీ కిముడు చిన్నమ్మలతో పాటు అప్పలరాజుపురం, వి.బి.పేట, అర్జునగిరి సర్పంచ్‌లు విద్యుత్ సరఫరాలో అంతరాయంపై నిలదీశారు. తురువోలు ఫీడర్ పరిధిలో సాయంత్రం వేళల్లో చిరుజల్లులు కురిసినా రాత్రి మొత్తం సరఫరా నిలిచిపోతుందన్నారు. కోనాం ఏరియాలో చిన్నపాటి సమస్యలను పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటి కుళాయి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ లాలం శారదావరలక్ష్మి, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, ఎంపీడీవో జయప్రకాష్ పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు పనులు పూర్తి చేయించాలని వినతి



విప్ ధర్మశ్రీకి సమస్య వివరిస్తున్న ఎంపీపీ వై.శ్రీనివాసరావు, నాయకులు

రోలుగుంట: భీమిలి–నర్సీపట్నం ప్రధాన రోడ్డులో వడ్డాది నుంచి వెలంకాయలపాలెం వరకు దెబ్బతిన్న రోడ్డు పనుల జాప్యంపై ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి. రమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోతల లక్ష్మీ శ్రీనివాస్, వై.రాజారావు గురువారం కలిశారు. ఈ రహదారిలో మదుములు తొలగించి, కొత్తవి నిర్మించేందుకుగాను గోతుల తవ్వి పనులు చేపట్టకుండా కాంట్రాక్టర్ వదిలేశాడని, పర్యవసానంగా వాహనచోదకులు, ఉద్యోగులు, విదార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. వెంటనే కాంట్రాక్టర్ పనులు చేయించాలని, లేకుంటే కాంట్రాక్ట్ రద్దు చేసి వేరేవారికి అప్పగించాలని కోరారు. దీనిపై ధర్మశ్రీ స్పందిస్తూ ఈ విషయాన్ని ఇప్పటికే ఆ శాఖ అధికారులకు, కాంట్రాక్టర్‌కు చెప్పామన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ రోడ్డు పూర్తి చేయించేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు.